ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY 5 **జనగామ**

బుధవారం 31 జనవరి 2024



చెల్లించేదెప్పుడో..?!

- రేపటితో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం
- లక్షల్లో పెండింగ్ బిల్లులు
- పేరుకుపోయిన రూ.100 కోట్లు
- ఇప్పుడైనా మోక్షం కలిగేనా..?!

రఘునాథపల్లి, జనవరి 30: గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం రేపటి(గురువారం)తో ముగియనుంది. గ్రామాలలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు రూ.లక్షల్లో అలాగే ఉండిపోవడంతో సర్పంచ్‌లు ఆందోళనలో ఉన్నారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 281 గ్రామ పంచాయతీలున్నాయి. పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, డ్రెయినేజీ, సీసీ రోడ్లు, తడి-పొడి చెత్త సేకరణ, షెడ్ల నిర్మాణాలకు సర్పంచ్‌లు అదనంగా ఖర్చు చేసిన డబ్బులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. చాలా మంది సర్పంచ్‌లు ఉన్న ఆస్తులు అమ్ముకుని, అప్పులు తీసుకొచ్చి పనులు చేశారు. ఒక్కో పంచాయతీ పరిధిలో సగటున రూ.3 నుంచి రూ.8 లక్షల వరకు పెండింగ్ బిల్లులున్నాయి. దీంతో జిల్లాకు సుమారు రూ.100 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సైతం నిధులు మంజూరు కాకపోవడం సర్పంచ్‌ల పాలిట శాపంగా మారింది. కొత్త ప్రభుత్వంలోనైనా పెండింగ్ బిల్లులకు మోక్షం లభిస్తుందేమోనని నిన్నటి వరకు ఎదురు చూసిన సర్పంచ్‌లకు చివరికి నిరాశే మిగిలింది. పెండింగ్‌లో ఉన్న లక్షల రూపాయల బిల్లులు రాకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు ఇంటి చుట్టూ తిరుగుతున్నారని సర్పంచ్‌లు వాపోతున్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు ఆదుకోలేదు

మూడు నెలల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధులు తమ పెండింగ్ బిల్లులకు ఉపయోగపడతాయని సర్పంచ్‌లు భావించగా.. అవి సిబ్బంది జీతభత్యాలు, కరెంటు బిల్లులు, పంచాయతీ నిర్వాహణకే సరిపోయాయి. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఎప్పటిలాగానే పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులైనా వస్తాయోమోనని గంపెడు ఆశతో ఎదురు చూసిన సర్పంచ్‌లకు నిన్నటి వరకు కూడా అవి రాకపోవడంతో తీవ్ర నిరాశే మిగిలింది. సంవత్సరం నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రాకపోవడం..పెండింగ్ బిల్లులు పేరుకపోవడంతో సర్పంచ్‌లలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన రానుంది. సర్పంచ్‌లకు ఉన్న అధికారాలు రేపటి నుంచి అన్ని తొలిగిపోతాయి. ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లులు రావాలంటే ప్రత్యేక పాలనలో అధికారుల చుట్టూ తిరగాల్సి ఉంటుందని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవి ఉన్నప్పుడే తమకు తమకు బిల్లులు మంజూరు చేసుకోవడంలో నానా తిప్పలు పడుతున్నామని, పదవి పోతే తమ పరిస్థితి ఏమిటనే ఆలోచనలో సర్పంచ్‌లు కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రత్యేక అధికారుల పాలన

సర్పంచ్‌ల పదవీ కాలం రేపటితో ముగియనుండగా ఫిబ్రవరి 2 (శుక్రవారం) నుంచి పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది.

జిల్లాలోని 281 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించే కసరత్తు పూర్తయింది. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీల నిర్వహణ పూర్తి బాధ్యత వారిపైనే ఉంటుంది. అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లుల మంజూరు గ్రామ పంచాయతీ నిర్వహణ వంటి పనులన్నీ ప్రత్యేక అధికారులే చూస్తారు. ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లుల మంజూరుపై సర్పంచుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రూ.10 లక్షల పెండింగ్ బిల్లులు ఉన్నాయి : ముప్పిడి శ్రీధర్, సర్పంచ్-ఖిలాషాపూర్



గత ప్రభుత్వం హయాంలో సొంత డబ్బులు ఖర్చు పెట్టి చేసిన పల్లె ప్రకృతి వనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, క్రీడా ప్రాంగణాలకు సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకు రాలేదు. జీపీకి వచ్చే ఆదాయం సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ ఈఎంఐకే సరిపోతోంది. అభివృద్ధి పనుల కోసం అప్పులు చేసి పెట్టిన రూ.10 లక్షలు నాకు రావాలి. పనుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

సర్పంచ్‌లు చేసిన పనులకు
తక్షణమే బిల్లులు చేయాలి

కొర్రీలు పెడితే సహించేది లేదు

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, జనవరి 30 : సర్పంచ్‌లు చేసిన పనులకు తక్షణమే బిల్లులు చేయాలని కొర్రీలు పెడితే సహించేది లేదని మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, వ్యవసాయ శాఖ, ఐకేపీ తదితర శాఖలకు చెందిన అధికారులు వారివారి ప్రగతి నివేదికలను సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు మధ్యలో జోక్యం చేసుని ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, తద్వారా తాము తీవ్రంగా నష్టపోయామని కడియం ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ, గడిచిన తొమ్మిదిన్నరేళ్ళ కాలంలో నాటి సీఎం కేసీఆర్ గ్రామాల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని, సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు తక్షణమే అధికారులు రికార్డులు చేపట్టి బిల్లులు విడుదల చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాలభివృద్ధి సాధ్యపడుతోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన చిలుపూర్ మండలంలో కాంప్లెక్స్ నిర్మాణానికి (మండల కార్యాలయాల భవన సముదాయం) నిధులు మంజూరు చేయిస్తానని కడియం శ్రీహరి అన్నారు.

అనంతరం నేటితో పదవీ విరమణ పొందుతున్న సర్పంచులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కడియం ఆలయ శాశ్వత దాత, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పొట్లపల్లి శ్రీధర్ రావుతో కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పులుగు వేణుగోపాల్ రెడ్డి, పస్నీరు మధుసూదన్, వైస్ ఎంపీపీ భూక్యా సరిత, తహసీల్దార్ సరస్వతి, ఈజీఎస్ ఏపీవో మోహన్‌రావు, సీడీపీవో ఫ్లారెన్స్, సూపర్‌వైజర్ దూలమ్మ, పీఆర్ ఏఈ నరేష్‌కుమార్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనేష్, మల్కాపూర్ పీహెచ్‌సీ హెచ్‌ఈవో చాడ బుచ్చిరెడ్డి, ఏఈవో బూర్ల నర్సింహులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

మండల కాంప్లెక్స్‌కు స్థల కేటాయింపు అభినందనీయం

నూతనంగా ఏర్పడిన చిలుపూర్ మండలంలో కార్యాలయాల భవన సముదాయం కోసం స్థానిక సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, తన తండ్రి ఉద్దెమారి బాలయ్య స్మారకార్థం లక్షలాది రూపాయల స్థలాన్ని విరాళంగా అందించడం అభినందనీయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం అట్టి స్థలంలో ఏర్పాటు చేసిన ఉద్దెమారి బాలయ్య విగ్రహాన్ని గ్రామస్థుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు.

ఉదయం ప్రారంభం..
సాయంత్రం ముసుగు..



సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ భూర్ల విష్ణు, నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్/ స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ జనవరి 30: మండలంలోని శివునిపల్లిలో మంగళవారం ఉదయం గ్రామ సర్పంచ్ భూర్ల విష్ణు, గ్రామ నాయకులతో కలిసి సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ప్రారంభించగా సాయంత్రం జీపీ సిబ్బంది విగ్రహానికి నల్లని ముసుగువేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని శివునిపల్లిలో బొడ్రాయి వద్ద అనేక ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సుభాష్‌చంద్రబోస్ విగ్రహం శిథిలవస్థకు చేరింది. దీంతో సర్పంచ్ భూర్ల విష్ణు గ్రామానికి చెందిన దాత మంగు వేదప్రకాష్ సహకారంతో విగ్రహాన్ని తెప్పించి మంగళవారం ప్రారంభించారు. అయితే ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విగ్రహాన్ని ఎలా ప్రారంభిస్తారని గ్రామానికి చెందిన కొందరు నాయకులు సంబంధిత అధికారులకు విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విగ్రహానికి జీపీ సిబ్బందితో ముసుగు వేయించారు. ఈ విషయమై శివునిపల్లి పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గ్రామానికి చెందిన కొందరు డీఎల్‌పీవో వెంకటప్రసాద్‌కు ఫిర్యాదు చేశారన్నారు.



విగ్రహానికి ముసుగు వేస్తున్న జీపీ సిబ్బంది

సంబంధిత విషయమై డీఎల్‌పీవో విచారణ జరిపి అనుమతులు లేకుండా, కలెక్టర్ పర్మిషన్ లేకుండా, గతంలో ఉన్న పాత విగ్రహాన్ని తొలగించి ఏమీ చేస్తారనే విషయాలను కలెక్టర్‌కు నివేదించకుండా అవిష్కరించినందున విగ్రహానికి ముసుగు వేయించాలని ఆదేశించారని తెలిపారు. ఆయన అదేశాల మేరకు జీపీ సిబ్బంది సహకారంతో ముసుగు వేయడం జరిగిందన్నారు.

ఖాకీ దుస్తులు వేసుకున్న భక్తులం

వనదేతల సన్నిథిలో మెరుగైన సేవలు అందిస్తాం..

ములుగు ఎస్పీ శబరీశ్

పూజారులు, ఆదివాసీ యువతతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ములుగు ఎస్పీ శబరీష్

మేడారం, జనవరి 30: పోలీసులు ఖాకీ దుస్తులు వేసుకున్న భక్తులని ములుగు ఎస్పీ శబరీశ్ అన్నారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ సన్నిధిలో మెరుగైన సేవలు అందించాలన్నదే ధ్యేయమన్నారు. ఇందుకు తమకు సహకరించాలని కోరారు. తాడ్వాయి మండలం మేడారం పోలీసు సమావేశ హాల్‌లో పూజారులు, ఆదివాసీ యువతతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు వైభవంగా జరుగుతుందన్నారు. జాతరణ విధుల్లో పాల్గొనే పోలీసులకు యువత తోడ్పాటు అందించి సేవల్లో భాగస్వాముల కావాలన్నారు. జాతర సమయంలో పూజారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఊరేగింపులో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న దేవతలను ఒక్కసారిగా గద్దెలకు చేర్చేందుకు డీఎస్పీ స్థాయి అధికారులతో రోప్ పార్టీని ఏర్పాటు చేయాలని ఎస్పీని పూజారులు కోరారు. సమ్మక్క దేవత ఊరేగింపులో మూడంచెల భద్రత వ్యవస్థను ఉంచాలన్నారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన ఉన్న పోలీసు అధికారులను నియమించాలన్నారు. సమ్మక్కకు చర్చ వంశీయులు సమర్పించే హారతికి భక్తుల రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు.

దీనిపై ఎస్పీ మాట్లాడుతూ.. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గత జాతరలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. జాతర విజయవంతానికి యువత సహకారం ముఖ్యమన్నారు. మేడారం తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకునే భక్తులందరినీ మన అతిథులుగా భావించి సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, సుభాష్, పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సిద్ధబోయిన మునీందర్, లక్ష్మణ్‌రావు, మహేష్, సారయ్య, కృష్ణయ్య, కిరణ్, వెంకటేశ్వర్లు, భుజంగరావు, లక్ష్మణ్‌బాబు, కనకమ్మ, గోవర్ధన్, రాజు, బుచ్చిరాములు, మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొండాయి, మల్యాల, పునుగొండ్ల గ్రామాల ఆదివాసీ యువత పాల్గొన్నారు.

వనదేవతలకు మొక్కులు

మేడారం, జనవరి 30: వనదేవతలు సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడానికి భక్తులు మంగళవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21న మహాజాతర ప్రారంభం కానుండగా ముందస్తుగా తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. 20వేలకు పైగా భక్తులు తరలివచ్చినట్టు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివశక్తుల పూనకాలు డోలు, సన్నాయిల మధ్య గద్దెలకు చేరుకున్నారు. కుటుంబ సమేతంగా తల్లులకు పూజలు చేశారు. అనంతరం మేడారం పరిసరాల్లో విడిది చేసి వంటావార్పు చేశారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

పర్మిషన్ లేదు.. వెళ్లిపోండి..

- విలేకరులపై మునిసిపల్ కమిషనర్ అత్యుత్సాహం
- అధికారుల తీరును నిరసిస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్ల వాకౌట్





కాంగ్రెస్ కౌన్సిలర్లతో వాగ్వాదం చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు, వాకౌట్ చేసిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

జనగామ టౌన్, జనవరి 30: జనగామ మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రమౌళి విలేకరులపై అత్యుత్సాహం ప్రదర్శించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పాలనలో సభకు విలేకరులను అనుమతించని విషయం తెలిసిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గత నెల మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరుకాగా విలేకరులను సమావేశానికి అనుమతించారు. దీంతో ఈసారి కూడా అనుమతిస్తారని వెళ్లగా మునిసిపల్ కమిషనర్ చంద్రమౌళి అభ్యంతరం వ్యక్తం చేశారు. బయటికి వెళ్లాలని ఆదేశించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ కౌన్సిలర్ వంగాల కల్యాణి భర్త మల్లారెడ్డి సభ ముఖద్వారం వద్ద నిలబడి అధికారులను నిలదీశారు. రాష్ట్రంలో ప్రజా పాలన మొదలైందని, అంతటా విలేకరులను అనుమతిస్తుంటే ఇక్కడెందుకు కొత్త రూల్ పాటిస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పల్లా వెంట నలుగురు వ్యక్తులను ఎలా సభలోకి అనుమతించారని నిలదీశారు. ఆయనపై ఒక్కసారిగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు విరుచుకుపడ్డారు. మీరెవరు ప్రశ్నించడానికి అంటూ మూకుమ్మడిగా గొడవకు దిగారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ల వాకౌట్

విలేకరులను బయటికి పంపించడంపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యను నిరసిస్తూ నలుగురు కౌన్సిలర్లు వంగాల కల్యాణి, జక్కుల అనిత, గంగరబోయిన మల్లేశ్, రామగళ్ల అరుణ సభను వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో సాకుతో బయటికి వెళ్లగొట్టిన అధికారులు గత నెల ఎందుకు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. అధికారులు ఎమ్మెల్యే పల్లా కనుసన్నల్లో పనిచేయడం దురదుష్టకరమన్నారు. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఆరు ఎజెండా అంశాలు ఆమోదం

కౌన్సిల్ సమావేశంలో 6 ఎజెండా అంశాలను ప్రవేశపెట్టగా వాటిని ఆమోదించారు. నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్ల వాకౌట్ అనంతరం గొడవ సద్దుమణిగాక ఎజెండా అంశాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్, మునిసిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో
సర్పంచ్‌లదే కీలక పాత్ర

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

వివరాలు 8వ పేజీలో

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

జనగామ కల్చరల్, జనవరి 30: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని గత ప్రభుత్వానికి ఎన్ని సార్లు కోరినా ఫలితం లేకుండా పోయిందన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యార్థుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్యకు వినతిపత్రం అందించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి పరీక్షలు
- హాజరు కానున్న 7,900 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డెక్ సభ్యులు

జనగామ కల్చరల్, జనవరి 30: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 1 నుంచి పరీక్షల నిర్వహణకు ఇంటర్ బోర్డు అధికారులు సమాయత్తమయ్యారు. ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 7900 మంది విద్యార్థులు హాజరు కానుండగా 34 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. సీఎస్, డీవోలను నియమించి వారికి పరీక్షలపై అవగాహన కల్పించారు. మెటీరియల్ పంపిణీ చేసి, ప్రశ్నాపత్రాలను సంబంధిత పరీక్షా కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు..

రేపటి నుంచి పరీక్షలు

2023-24 విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో జనరల్ విద్యార్థులకుగాను 21 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు, ఒకేషనల్ విద్యార్థులకు 13 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలతో మొత్తం 34 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో జనగామ పట్టణంలో జనరల్ విద్యార్థులకు 10, ఒకేషనల్ విద్యార్థులకు 5 కేంద్రాలు ఉన్నాయి. పరీక్షల నిర్వహణకు 28 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 9 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు.

సెలవు దినాల్లోనూ ప్రాక్టికల్స్

ప్రాక్టికల్ పరీక్షలు సెలవు దినాల్లోనూ నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఇంటర్ విద్యార్థులను సబ్జెక్టుల వారీగా బ్యాచ్‌లుగా విభజిస్తారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు మూడు విడతలుగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 5వ

మిగతా 8వ పేజీలో...

సోషియాలజీలో సాంబశివరావుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 30: కేయూ సోషియాలజీ విభాగం పరిశోధకుడు తమ్మిశెట్టి సాంబశివరావు డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం సాంబశివరావుకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్రకటించారు. ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్టర్స్ ఆఫ్ డిసబులిటీ స్టూడెంట్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ - ఏ స్టడీ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్టు ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను డాక్టరేట్ లభించింది. సోషియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కుంట అయిలయ్య పర్యవేక్షణలో సాంబశివరావు పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపంకుంటకు చెందిన దివ్యాంగుడైన సాంబశివరావు 70పైగా సినిమా పాటలు, 11 సినిమా కథాలను రాశారు.

సాహిత్యంలోనే సామాజిక చైతన్యం

● వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ● కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 30: సాహిత్యంతోనే సమాజంలో చైతన్యం పరిఢవిల్లుతుందని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్బోధించారు. మంగళవారం కేయూ, వల్లంపట్ల ఆర్ట్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన వల్లంపట్ల సాహిత్యం- సామాజిక చైతన్యం' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన సదస్సుకు వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం ప్రజలను దగ్గర చేస్తోందని, తద్వారా సామాజిక చైతన్యం వస్తుందన్నారు. గొప్ప చైతన్య శీలి, ఆచరణ వాది, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అని చెప్పారు. వల్లంపట్ల ప్రభుత్వ కార్యక్రమాలను కళారూపాలతో ప్రజలల్లోకి తీసుకువచ్చి చైతన్య పరిచారని అన్నారు. హేతుబద్ధత గీటు రాయి అన్నారు. వాదాలు ఏమైనా దానికి వేదిక తెలుగు విభాగం అవుతోందని చెప్పారు. వర్సిటీలో జరుగున్న పరిశోధన క్రమాన్ని కొనియాడారు. పరిశోధన పట్ల వల్లంపట్ల జీవితాన్ని తీసుకోవడం, ఇతర గొప్ప వ్యక్తుల జీవితాన్ని పరిశోధన అంశంగా తీసుకోవడం నూతన ప్రక్రియని చెప్పారు. సాహిత్యంపై చర్చలో సామాజిక చైతన్యం సాధ్యం అవుతోందని అన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ బీఎస్‌రాములు మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు 5 దశాబ్దాలుగా తన కలాన్ని, గళాన్ని అర్పించిన నాగేశ్వర్‌రావు గొప్పవారిని చెప్పారు. సదస్సులో ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ రతన్‌సింగ్ ఠాకూర్, కవయిత్రి, రచయిత అనిశెట్టి రజిత, ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, కామర్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, డాక్టర్ తాళ్ళపల్లి యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో హనుమకొండ వాసి



గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో శ్రేష్ట

హనుమకొండ కల్చరల్, జనవరి 30: హనుమకొండ కొత్తూరు జెండా ప్రాంతానికి చెందిన పాసికంటి శ్రీశ్రేష్ట ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 10 మంది విద్యార్థులు ఎంపిక కాగా, తెలంగాణ నుంచి ఎంపికైన అత్యంత చిన్న వయస్కురాలు కావడం విశేషం. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ చదువుతున్న శ్రేష్ట. నెల రోజులుగా న్యూఢిల్లీలో జరుగుతున్న క్యాంపులలో పాల్గొంటోంది. సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా పరేడ్ ప్రత్యేక కవాతులో ఆమె శిక్షణ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అవకాశం, ఆయన ముందు జరిగిన కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

తునికాకు సేకరణకు టెండర్లు వేయాలి..

ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళకమాండర్ అశోక్

మహబూబాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024 సీజన్‌లో తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లను ఆహ్వానించి టెండర్లు వేసి ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళకమాండర్ అశోక్ డిమాండ్ చేశారు. ఆయనపేరిట మంగళవారం ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపిన లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. 50 ఆకులతో కూడిన కట్టకు రూ.5 ప్రభుత్వం ధరను నిర్ణయించాలన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లోఉన్న బోనస్‌ను ఆకు సేకరణ పనులకు ముందే చెల్లించాలని పేర్కొన్నారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బుల చెల్లింపుల్లో అవకతవకలు, అవినీతి అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తునికాకు రేటును పెంచడం ద్వారా కూలీలు ఆకు టార్గెట్‌ను పూర్తి చేయడంతో పాటు కూలీలకు, ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు ఆదాయం పెరుగుతుందన్నారు. బహుళ ఆదాయాలకు అవకాశాలు ఉన్న తునికాకు టెండర్లను త్వరగా పూర్తి చేయాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు.

నర్సంపేట మునిసిపాలిటీలో వీగిన అవిశ్వాసం

● కోరం లేక వీగిన తీర్మానం ● చైర్మన్ పదవిని నిలబెట్టుకున్న గుంటి రజని



నర్సంపేట మునిసిపాలిటీ అవిశ్వాస సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



కోరం లేక అవిశ్వాసం వీగిపోయిందని వివరిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి, వేదికపై కమిషనర్ వెంకటస్వామి

నర్సంపేట, జనవరి 30 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీని పదవి నుంచి తొలగించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు వేసిన పాచిక పారలేదు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌పై ఇదే పార్టీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం ఎట్టకేలకు వీగిపోయింది. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలోని సమావేశ గదికి కమిషనర్ నాయిని వెంకటస్వామితో కలిసి ప్రత్యేక అధికారి స్థానిక ఆర్డీవో కృష్ణవేణి చేరుకున్నారు. షెడ్యూల్ సమయం 11 గంటల వరకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన 13 మందితోపాటు మద్దతు పలికిన మరో కౌన్సిలర్ హాజరవుతారని అందరూ భావించారు. కానీ అంచనాలు తలకిందులై 12గంటల వరకు ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాలేదు. ఆ తర్వాత ప్రత్యేక అధికారి అవిశ్వాస పరీక్షకు మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు.

మునిసిపాలిటీలో 24 వార్డులు ఉన్నాయి. ఇందులో 18వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. దీనికి తోడు ఎమ్మెల్యేతో కలిసి 25 మంది సభ్యులు అవుతారు. ఇందులో ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లను అవిశ్వాసానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస సమావేశానికి దూరంగా ఉన్నారు. మిగిలిన 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో అవిశ్వాసం పెట్టిన 13 మందితోపాటు వీరికి మద్దతునిచ్చిన మరో కౌన్సిలర్ సమావేశానికి హాజరుకాలేదు. అవిశ్వాసానికి వ్యతిరేకించిన నలుగురు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగి పోయినట్లు ప్రత్యేక అధికారి, ఆర్డీవో కృష్ణవేణి ప్రకటించారు.



నర్సంపేట మునిసిపల్ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై రవి, సిబ్బంది

హాజరుకాని చైర్‌పర్సన్

పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన 13 మంది కౌన్సిలర్లతోపాటు మద్దతు ఇచ్చిన మరో కౌన్సిలర్ కలిసి 14 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. మరో ముగ్గురు కౌన్సిలర్ల మద్దతు లేనిదే అవిశ్వాసం నెగ్గే పరిస్థితి లేదని గ్రహించి సమావేశానికి చైర్‌పర్సన్ గైర్హాజరయ్యారు. మిగిలిన నలుగురిలో ఒకరు నర్సంపేటలోనే ఉండగా మరో ఇద్దరు కౌన్సిలర్లు(దార్ల రమాదేవి, ఎండి. పాషా) మూడు రోజుల క్రితం చైర్‌పర్సన్ రజనికి మద్దతుగా క్యాంపునకు వెళ్లారు. 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో 17మంది మద్దతు అవసరం ఉంది. అవిశ్వాసానికి మద్దతునిచ్చిన 14మంది కౌన్సిలర్లకు చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించాలన్న అవిశ్వాసం నెగ్గక చుక్కెదురైంది. తోటి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నుంచి బయట పడడానికి ఇద్దరు కౌన్సిలర్లతో కలిసి క్యాంప్‌కు వెళ్లిన చైర్‌పర్సన్ గుంటి రజని చైర్మన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. దీంతో చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించాలని భావించి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన 14 మంది కౌన్సిలర్ల ఆలోచన బెడిసి కొట్టింది. అవిశ్వాసం వీగి పోవడంతో వారిలో నిరాశ చోటు చేసుకుంది.

అవిశ్వాస అంశానికి తెర

గత నెల రోజులుగా కొనసాగుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం తీర్మానం పెట్టిన అంశానికి సోమవారం అవిశ్వాసం వీగి పోవడంతో తెరపడినట్లయింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి 14మంది కౌన్సిలర్లు మద్దతు పలుకగా నలుగురు అవిశ్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. 17మంది కౌన్సిలర్ల బలం ఉంటేనే అవిశ్వాసం నెగ్గేది. అయితే ఆ 14 మందికి నలుగురు సహకరించక పోవడం, వీరికి కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా సహకరించకుండా అవిశ్వాసానికి దూరంగా ఉండడంతో కోరం లేక వీగిపోయింది.

బీఆర్ఎస్ పార్టీకి 14 మంది కౌన్సిలర్ల రాజీనామా

మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి వెల్లడి



నర్సంపేటలో తోటి కౌన్సిలర్లతో కలిసి రాజీనామా చేస్తూ వ్రాసిన పత్రాన్ని చూపుతున్న వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 30 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన 14 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నర్సంపేటలోని సర్వాపురంలో 14మంది కౌన్సిలర్లు మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చైర్‌పర్సన్ ఒంటెద్దు పోకడలు నచ్చక ఏడాది కిందట అవిశ్వాసం పెట్టాలని నిర్ణయానికి వచ్చామన్నారు. అయితే జనవరి 30వ తేదీవరకు అవకాశం లేదని తెలిసి అప్పుడు ఆలోచనను విరమించుకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మాట్లాడుతానని హామీ ఇచ్చారన్నారు. అయినా చైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య సమన్వయం చేయకపోవడంతో జనవరి 2న కలెక్టర్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానపత్రాన్ని ఇచ్చామన్నారు. రెండు రోజుల కిందట క్యాంపునకు వెళ్లిన కౌన్సిలర్లతో మాట్లాడి సమన్వయం చేస్తానని చెప్పి 15మంది కౌన్సిలర్లతో విప్ పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. ముగ్గురిని పిలిపించి విప్ పత్రంపై సంతకాలు చేయించకపోవడం.. ఇచ్చిన మాటను సుదర్శన్‌రెడ్డి తప్పడంతో మనస్తాపానికి గురైన 14 మంది కౌన్సిలర్లు.. పార్టీకి రాజీనామా చేస్తున్నామని ప్రకటించారు. తమ రాజీనామా లేఖను బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణ ద్వారా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి పంపిస్తామన్నారు. 14 మంది కౌన్సిలర్లలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారు ఎవరూ లేరన్నారు. డబ్బులు ఆశించిన వారు, భూములను కబ్జా చేసిన వారు లేరన్నారు. ప్రజల వద్ద కౌన్సిలర్లు డబ్బులు వసూలు చేస్తే మునిసిపాలిటీలో పనులు అవుతాయా ఆలోచించాలన్నారు. చైర్‌పర్సన్‌అసమర్థతతోనే కోట్లాది రూపాయల నిధులున్నా... వార్డుల్లో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ఇప్పుడు నిధులు మురిగిపోయే అవకాశాలు ఉన్నాయని వెంకట్‌రెడ్డి వాపోయారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిపై సూచన మేరకు విప్‌పై తాము సంతకాలు చేశామని, అయితే సంతకాలు చేయని చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్లపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నామని వెల్లడించారు. ఒకటి రెండు రోజుల్లో ఆలోచించి కౌన్సిలర్ పదవులకు సైతం రాజీనామా చేయాలనుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రుద్రమల్లీశ్వరి, గంప సునీత, వేల్పుగొండపద్మ, బానాల ఇందిర, దేవోజు తిరుమల, రామసహాయం శ్రీదేవి, గండె రజిత, శీలం రాంబాబు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, జుర్రురాజు ఇతర కౌన్సిలర్లుతోపాటు నాయకులు నాగిశెట్టి ప్రసాద్, రుద్ర ఓం ప్రకాశ్, గండె చం ద్రమౌళి. సుధాకర్‌రెడ్డి, దేవోజు సదానందం తదితరులు పాల్గొన్నారు.

నేను రాజీనామా చేయడం లేదు: పద్మరాజు

తాను బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని కౌన్సిలర్ వేల్పుగొండ పద్మరాజు మంగళవారం సోషల్ మీడియాలో వెల్లడించారు. అంతకుముందు మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి 14 మందితో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న పద్మరాజు.. సమావేశం అనంతరం తాము బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడం లేదని, పార్టీలోనే కొనసాగుతామని వెల్లడించడం కొసమెరుపు. దీంతో 13 మందే రాజీనామా చేసినట్లు భావించాల్సి ఉంటుంది. వీరిలో కూడా ఇంకా ఎవరైనా మనసు మార్చుకుంటారా అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి

దొంగతనం కేసులో నలుగురు అరెస్టు

● రూ.1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీ ● ఆటో సీజ్



నర్సింహులపేట ఠాణాలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

నర్సింహులపేట, జనవరి 30: నర్సింహులపేట, తొర్రూరు, మరిపెడ మండలాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ. 1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీతో పాటు చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తొర్రూరు సీఐ సత్యనారాయణ తెలిపారు. నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివరాలను వెల్లడించారు. నర్సింహులపేట మండలంలోని ముంగిమడుగు ఫకీరతండాకు చెందిన భూక్య హరికృష్ణ, గుగులోతు గణేష్, గుగులోతు సుమన్, గుగులోతు కళ్యాణ్‌లు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 10న మండలంలోని వంతడుపల తండాకు చెందిన ధరావత్ రూప్‌సింగ్ తన ఇంటి ఎదుట కట్టేసిన మేకపోతును ఎవరో గుర్తుతెలియని వారు ఎత్తుకుపోయారని నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సతీష్ విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నర్సింహు లపేట శివారు జయపురం క్రాస్‌రోడ్డువద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో 5 మేకలు, 4 గొర్రెలతో నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని విచారణ చేయగా మరిపెడ మండలంలోని కస్నాతండా, తొర్రూరు మండలంలోని ఫత్తేపురం, నర్సింహు లపేట మండలంలోని వంతడుపల తండాలో చోరీలకు పాల్పడి గొర్రెలు, మేకలు అపహరించి మార్కెట్‌లో విక్రయాలు జరిపినట్లు నిర్ధారణ జరిగింది. నిందితుల నుంచి రూ. 1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీ చేయడంతో పాటు చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను తొర్రూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. దొంగతనం చేసును చేదించిన ఎస్సై సతీష్, ఏఎస్సై వెంకన్న హెడ్‌పీసీ సంతోష్, రమేష్, వెంకన్న, శ్రీను, ఎం.రమేష్‌లను తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ అభినందించి రివార్డు అందజేశారు.

40 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రకు తరలింపు ● మానుకోట రైల్వేస్టేషన్‌లో పట్టివేత



గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్రబాబు

నెహ్రూశాసెంటర్, జనవరి 30 : విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 40 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్ర బాబు తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశ ంలో కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన మెగా రాజేందర్‌రొంకడే అనే మహిళ, అదే ప్రాంతానికి చెందిన విజయ్‌భరత్ సద్వార్తేలు గత కొంతకాలంగా విశాఖపట్టణం నుంచి మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాల్లోని ఇతర జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్కఫోర్స్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున మహబూ బాబాద్ రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ తనిఖీలు చేపట్టగా 40 కిలోల గంజాయి పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన ఇరువురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి బాదావత్ కిరణ్‌నాయక్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, రజిత, చిరంజీవి, మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముఖం కడుక్కుంటుండగా నల్లాకు విద్యుత్ సరఫరా

విద్యుదాఘాతంతో గడ్డిగూడెంలో వ్యక్తి మృతి



భూక్య శ్రీను మృతదేహం



భూక్య శ్రీను

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 : విద్యుదాఘాంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంతండాలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగూడెంతండాకు చెందిన భూక్య శ్రీను (40)తనకున్న 20 గుంటల భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం నిద్రలేచి ముఖం కడుక్కునేందుకు ఇంట్లోని నల్లా వద్దకు వెళ్లి ఇనుముతో ఉన్న నల్లా ట్యాప్‌ను పట్టుకున్నాడు. నల్లాకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై భూక్య శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మంగొని, తల్లి ద్వాలీ ఉన్నారు. భార్య మంగొని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ ఉదిత్

లింగాలఘణపురం, జనవరి 30: లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన ఏదునూరి ఉదిత్(15) అనే పదో తరగతి చదువుతున్న విద్యార్థి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ఏదునూరి కృష్ణ-రజితల కుమారుడు ఉదిత్ లింగాలఘణపురం టీఎస్‌ఎంఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో ఇంటి పక్కనే ఉన్న గొర్రెలదొడ్డిలో మంగళవారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే రెండు రోజుల క్రితం తన స్నేహితులతో తాను ఒకట్రెండురోజుల్లో చనిపోతానని తన అంతిమయాత్రలో డీజే పెట్టాలని చెప్పినట్లు చర్చ జరుగుతోంది. దీంతో అతని కోరిక మేరకు డీజే ఏర్పాటు చేసి అంతిమయాత్రను నిర్వహించడం గమనార్హం.

నలుగురు డీఎస్పీలకు స్థానచలనం

హనుమకొండ క్రైం, జనవరి 30: తెలంగాణ రాష్ట్ర మల్టీజోన్‌లో పనిచేస్తున్న నలుగురు డీఎస్పీలకు స్థానచలనం కలిగిస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.గంగాధర్ పీటీసీ కరీంనగర్ నుంచి వరంగల్‌కు, కె.నాగయ్య వరంగల్ నుంచి పీటీసీ, ఎం.శ్రీనివాస్ వరంగల్ నుంచి డీఏఆర్, ఎస్. సురేంద్ర వరంగల్ నుంచి రామగుండంలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన వారు ఒకటి రెండు రోజుల్లోవిధుల్లో చేరాలని ఆదేశించారు.

వాస్విక్ క్యాలెండర్ ఆవిష్కరించిన సీఎం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బచ్చన్నపేట, జనవరి 30: వాస్విక్ గ్రూప్ సంస్థలకు చెందిన క్యాలెండర్‌ను సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థల చైర్మెన్ మండలంలోని కట్కూరుకు చెందిన నిడిగొండ నరేష్‌కుమార్‌ను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. వాస్విక్ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను సీఎంకు వివరించారు. దీంతో నరేష్‌కుమార్‌తో పాటు ఆయన టీంను ముఖ్యమంత్రి అభినందించారు. ఆయన వెంట వైస్ చైర్మెన్ నూకల బాస్కర్‌రెడ్డి, చిలువేరు వెంకట అప్పారావ్ ఉన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో మినీ మేడారం

పాలకుర్తి, జనవరి 30 : తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ల కోసారి జరిగే గిరిజన మహా జాతర నిర్వాహణపై మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో సమ్మక్క, సారక్క గద్దెల నిర్మాణం, జన జాతర సందర్భంగా ప్రభుత్వం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు, జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు, స్నాన ఘట్టాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, జాతరలో ప్లాస్టిక్ వినియోగం నిషేధం, ట్రాఫిక్ నియంత్రణ, చెత్త సేకరణ, పారిశుద్ధ్య కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా జిల్లా పరిషత్ నమూనాను కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారి నవీన మాట్లాడుతూ కీర్తన, ఐశ్వర్య అనే విద్యార్థులు సమ్మక్క, సారక్కల వేషాధారణలు ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమీపిస్తున్న జాతర.. కొలిక్కిరాని కమిటీ ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 30: మండలంలోని ఇప్పగూడెం, కోమటిగూడెం, రంగరాయగూడెం, అక్కపల్లిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ ఎన్నిక మంగళవారం మరోమారు వాయిదా పడింది. ఇప్పటికే నాలుగు గ్రామాలకు చెందిన నాయకులు పలుమార్లు కమిటీ ఎన్నిక కోసం సమావేశమైనప్పటికీ మేమంటే మేమని పట్టుబడుతుండడంతో సమావేశాలు గొడవగా మారి కమిటీ ఎన్నిక వాయిదా పడుతోంది. మంగళవారం జాతర ప్రాగంణం వద్ద జరిగిన నాయకుల సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్‌రెడ్డిని చైర్మన్‌గా ప్రకటించారు. మిగితా కమిటీ కూర్పులో నాయకుల మధ్య సయోధ్య కుదురుక పోవడంతో మరోమారు నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోగా మరోమారు కమిటీ ఎన్నిక వాయిదా పడింది. జాతర సమీపిస్తుండడంతో కమిటీ ఎన్నిక కాకపోవడంతో జాతర వద్ద పనులు జరుగకపోవడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. కాగా కమిటీ ఎన్నిక కోసం బుధవారం నాయకులు జాతర ప్రాంగణం వద్ద సమావేశం కానున్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు శ్రీమహాలక్ష్మి


అవార్డుతో విద్యార్థిని శ్రీమహాలక్ష్మి

జనగామ కల్చరల్, జనవరి 30: జనగామ పట్టణానికి చెందిన విద్యార్థిని శ్రీమహాలక్ష్మి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపికైంది. జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఐల సునీత - వేణుమాధవ్ దంపతుల కుమార్తె శ్రీమహాలక్ష్మి స్థానిక ఏకశిల పబ్లిక్ స్కూల్ లో 8వ తరగతి చదువుతోంది. ఇటీవల భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో శివ పంచాక్షరి థీమ్ పై శ్రీమహాలక్ష్మి నృత్యం చేసి చక్కని ప్రతిభ కనబరిచింది. ప్రతిభా ప్రదర్శనకు గాను వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపికైనట్లు నిర్వాహకులు చల్లా కొండల్‌రావు తెలిపారు. మంగళవారం హైద్రాబాద్ లోని అష్టలక్ష్మీ దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. శ్రీమహాలక్ష్మి అవార్డుకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేశారు.

ఎస్ఎస్‌సీ టాపర్స్‌కు క్యాష్ అవార్డులు

జనగామ కల్చరల్, జనవరి 30: ఎస్ఎస్ఎస్-2023 లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు క్యాష్ అవార్డులు ప్రధానం చేశారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023 ఎస్ఎస్‌సీలో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.50 వేల క్యాష్ అవార్డులను ప్రధానం చేశారు. చొల్లేటి రాజా నరేందర్‌రెడ్డి మాతృమూర్తి చొల్లేటి యశోధరెడ్డి పేరుమీద ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా తెలుగు మీడియంలో ముగ్గురు విద్యార్థులకు, ఇంగ్లీషు మీడియం లో 4గురు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వి.రాజేందర్, ఉప్పలయ్య, కృష్ణమూర్తి, చొక్కయ్య, ఏ.నర్సింహారెడ్డి, ఎమ్డీ .అఫ్సర్, ఎస్.కనకయ్య పాల్గొన్నారు.


జనగామ లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


గాంధీజీకి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్లు


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


స్టేషన్ ఘన్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, తదితరులు

మహాత్ముడికి ఘన నివాళులు

జనగామ కల్చరల్, జనవరి 30: గాంధీ మహాత్ముడి బోధనలే మార్గదర్శనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ మహాత్ముడిని ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన బాటలో నేటి యువత పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతా రెడ్డి, బండ పద్మ, స్వరూప, అనిత, నాయకులు బండ యాదగిరిరెడ్డి, ఊడుగుల నర్సింహులు, బొట్ల శ్రీనివాస్, రాంప్రసాద్, కర్రె శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్ కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో జెడ్పీ సీఈవో అనిల్ కుమార్, ఏవో రవీందర్, సీపీవో ఇస్మాయిల్, డీఈవో రాము, డీఐఈవో బైరి శ్రీనివాస్, ఆర్డీవో మురళీకృష్ణ, డీడబ్ల్యూవో జె.జయంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● జనగామ టౌన్ : దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని కృష్ణకళామందిర్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, కంచ రాములు, సర్వల నర్సింగరాజు, మేడ శ్రీనివాస్, వంగాల మల్లారెడ్డి, బడికె ఇందిరా, చెంచారపు బుచ్చిరెడ్డి, బనుక శివరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్.సోమనర్సయ్య, మసురం రవీందర్, వనం మోహన్, వలభోజు రమేశ్, ముత్యం అంజయ్య, నసీర్, శ్రీనివాస్, కనకయ్య, బత్తుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : మండల కేంద్రంతో పాటు కంచనపల్లిలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో పాటు ఆర్య వైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లోనే సోమాజీ, రవి, రంగోజు ఈశ్వరయ్య, గొల్లూరి పృథ్వీ, పురుషోత్తం, మల్లేష్, కూరెల్లి పెద్దఉపేందర్, బచ్చు చిరంజీవులు, ఓరుగంటి శంకర్‌లింగం, శ్యాశెట్టి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ బాసెట్టి హరిప్రసాద్, ఎంఆర్ఐ అనిల్‌కుమార్, తదితర అధికారులు, ఉద్యోగ సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి గాంధీజీకి నివాళులర్పించారు.

● పాలకుర్తి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆ పార్టీ నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి ఎర్రబెల్లి రాఘవరావు, భూమ రంగయ్య, భాస్కర్, బీర్రు సోమేశ్వర్ ఉన్నారు.

●స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రంతో పాటు, శివునిపల్లి పట్టణాల్లో గాంధీ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యా సంస్థల్లో స్వాతంత్ర్య అమర వీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సు రేష్, ఎంపీటీసీలు నర్సింహులు, ఎం.రాజు, సంఘ నాయకులు ఎస్.వెంకట్రాంనర్సయ్య, బి.శ్రీనివాస్, కె.వెంకటేశ్వర్లు, ఎం.విజయ్‌కుమార్, ఎస్.ఆంజనేయులు, గట్టు రమేశ్, రంగారావు, జి.రమేశ్, పి.రవి, టి.రవికిరణ్, మహేందర్, శ్రీరాములు, మహేష్, శ్రవణ్ పాల్గొన్నారు.

● బచ్చన్నపేట :మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆలీంపూర్‌లో ఎంపీటీసీ ఎండీ మసూద్, సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డిలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట, జనవరి 30 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొదటగా వ్యవసాయశాఖతో ప్రారంభమైన సర్వసభ్య సమావేశం సదాసీదాగా సాగింది. ఈజీఎస్‌లో చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు రాలేదని నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సమయ పాలన పాటించం లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు శాఖల అధికారులు తమ నివేదికను చదివి వినిపించారు. సమావేశం అనంతరం పదవీకాలం ముగియనున్న సర్పంచ్‌లను పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, డీటీసీ మాలోతు శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్‌లతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజామొహినోద్దిన్, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

జనగామ కల్చరల్ : మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పోకల జమున, జెడ్పీ చైర్మెన్ గిరగాని భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి జె.జయంతి, సీడీపీఓ రమాదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి

బచ్చన్నపేట: తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే కాలువ తెగిపోవటంతో నీళ్లు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని, మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని మండలంలోని లింగంగపల్లి గ్రామ రైతులు జడ్పీ చైర్మెన్ గిరబోయిన భాగ్యలక్ష్మీ అంజయ్యతో కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిశారు. పడమటికేశ్వాపూర్ శివారు నుంచి లింగంపల్లి వచ్చే కాలువ మధ్యలో తెగిపోయిందన్నారు. గతంలో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయటంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కాలువ మరమ్మతుకు నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మెన్ మద్దికుంట రాధ, పీఏసీఎస్ డైరెక్టర్ తరిగొప్పుల శ్రీనివాస్, మహేశ్ తదితర రైతులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



మహబూబాబాద్ రూరల్, జనవరి 30: మహబూబా బాద్ జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడిగా యలమంచిల్లి వెంకటేశ్వరరావును నియమిస్తూ మంగళవారం రాత్రి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రకటించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సత్యనారా యణపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు విద్యార్థి దశలో వీహెచ్‌పీలో పని చేసి ప్రస్తుతం విశ్వహిందుపరిషత్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నాడు. ఆయన్ను మహబూబాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమించడం పట్ల మండల, జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి పత్తి కొనుగోలు నిలిపివేత

కొడకండ్ల, జనవరి 30 : మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఫిబ్రవరి 1 నుంచి పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు చైర్మన్ పేరం రాము మంగళవారం తెలిపారు. మండలకేంద్రంలో రైతులనుద్దేశించి మాట్లాడుతూ కొడకండ్ల మార్కెట్ పరిధిలోని వెంకటసాయి జిన్నింగ్ మిల్లు, వినాయక కాటన్ ఇండస్ట్రీస్, లక్ష్మీ శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్‌లలో, సీసీఐ కొనుగోలు పత్తి కేంద్రాలలో పత్తి, పత్తి గింజల నిల్వలు పేరుకుపోయాయన్నారు. అందువల్ల ఫిబ్రవరి 1 నుంచి తాత్కాలికంగా పత్తి కొనుగోలును నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయరంగం నిర్వీర్యం

పాలకుర్తి, జనవరి 30 : కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వంలో వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేష్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ స్మారక భవనంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, రోడ్లు, విమానీలు, బొగ్గు, మైనింగ్, ఓడరేవులు, ఎల్ఐసీ లాంటి వాటిని కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అప్పగించిందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేసేందుకే కేంద్రం నల్ల చట్టాలను తీసుకువచ్చిందన్నారు. సమావేశంలో నాయకులు చిట్యాల సోమన్న, సారయ్య, సోమ సత్యం, ఇంద్రారెడ్డి, ఐలయ్య, శ్రీలత, ప్రవీన్, సోమనర్సయ్య శ్రీకాంత్, దర్గయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహభావాన్ని పెంపొందించుకోవాలి

చిలుపూర్, జనవరి 30 : కుల, మతాలకతీతంగా ప్రతిఒక్కరూ అంటరానితనాన్ని వీడి స్నేహబంధాన్ని పెంపొందించుకోవాలని అంబేద్కర్ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సుదర్శన్ అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నపెండ్యాల దళిత కాలనీలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ, మారుతున్న సాంకేతికతతో పాటు, కాలానికనుగుణంగా ప్రతీఒక్కరూ కులవివక్ష నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టాలను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కలువల శ్రీనివాస్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇల్లందుల హరిబాబు, సురేశ్, అరుణ్, ప్రభాకర్, రాకేశ్, ఇల్లందుల విజయ్, బుచ్చయ్య ఎల్లయ్య, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుగులు వెంకన్నకు సువర్ణ పుష్పార్చన


వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చిలుపూర్, జనవరి 30 : చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయంలో సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు స్వామివారి పాదాలను 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు ఆశీర్వచనంతో పాటు, స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం పూజారులు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు మాట్లాడుతూ, ప్రతీ మంగళవారం నిర్వహించే సువర్ణ పుష్ప, అష్టదళ పాద పద్మారాధన పూజకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న, చల్లారపు శ్యామ్, జీడి ఆనందం, రత్నాకర్ రెడ్డి, పేరాల సుధాకర్, ఎంపీటీసీ సాదం నర్సింహులు, మోడెం విజయభాస్కర్, పూజారి కృష్ణమాచార్యులు, సిబ్బంది ఆడెపు రమేష్, వీరన్న. విశాల్, గాదె రాజశేఖర్ పాల్గొన్నారు.

స్వామి దర్శించుకున్న డీపీవో రంగాచారి

మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) రంగాచారి మంగళవారం సందర్శించారు. సతీమణి పద్మతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ డీపీవోకు స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు, ఆశీర్వచనం అందజేశారు.

తూతూమంత్రంగా మండల సభ

రఘునాథపల్లి, జనవరి 30: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకో సారి జరగాల్సిన మండల సభ రఘునాథపల్లిలో తూతూ మంత్రంగా ముగిసింది. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ మేకల వరలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. మండల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు అంకిత భావంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండడంతో మండలంలోని 36 గ్రామాలకు చెందిన సర్పంచ్‌లను ఎంపీపీతో పాటు అధికారులు మండల సభలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎమ్డీ .హషీం, తహసీల్దార్ యుగేందర్, ఎస్ఐ రఘుపతి, ఎంపీవో వెంకటేశ్వర్లు, లక్ష్మీపతి, సతీష్, సారయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నర్మెట, జనవరి 30 : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్‌ఎంగా సిహెచ్ రవళి, డీఈవోగా విలియం కేరి, ఉపాధ్యాయులుగా కొన్నె దీక్షిత్, కన్నెబోయిన రవితేజ, మంద రోహిత్, పులి తనయ్, కొన్నె సంజనశ్రీ, మానస, రిషిత వ్యవహరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వెంకటొరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం సామ్యూల్ పాల్గొన్నారు.


అవార్డులతో విద్యార్థులు

సెయింట్ పాల్స్ హైస్కూల్లో అవార్డుల ప్రధానోత్సవం

జనగామ కల్చరల్, జనవరి 30: రజతోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత ఆదివారం పాఠశాలలో రజతోత్సవ వేడుకలు నిర్వహించిన విషయం విదితమే. కార్యక్రమానికి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్య భూమిక పోషించగా, విజయవంతానికి కృషి చేసిన వారందరికీ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మరియ జోసెఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

తేదీ వరకు మొదటి విడత, 6 నుంచి 10 వరకు రెండో విడత, 11 నుంచి 15 వరకు మూడో విడత పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 15వ తేదీతో ప్రాక్టికల్ పరీక్షలు ముగుస్తాయి.

హాజరు కానున్న 7,900 మంది విద్యార్థులు

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 7900 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో 3,164 మంది జనరల్ విద్యార్థులు, 1,197 మంది ఒకేషనల్ విద్యార్థులు, సెకండ్‌ఇయర్‌లో 2,346 మంది జనరల్ విద్యార్థులు, 1,203 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ప్రతి రోజు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహించనున్నారు

డెక్ ఏర్పాటు ...

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు ఏటా జిల్లా పరీక్షల కమిటీ (డెక్)ను ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. డెక్ కన్వీనర్‌గా డీఐఈవో బైరి శ్రీనివాస్, మొదటి సభ్యునిగా కే.ఆంజనేయ రాజు (ప్రిన్సిపాల్, జీజేసీ, జఫర్‌గడ్), రెండో సభ్యునిగా వేముల శేఖర్ (ప్రిన్సిపాల్, జీజేసీ ధర్మకంచ, జనగామ) నియమిస్తూ ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా హైపవర్ కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మెన్‌గా వ్యవహరిస్తారు. కమిటీలో ఆర్‌జేడీ, డీఐఈవో, డీసీపీ సభ్యులుగా ఉంటారు.

పర్యవేక్షణ ఇలా ...

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పర్యవేక్షకులు నియంత్రిస్తారు. ఈ మేరకు పరీక్షలను పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ప్రతి రోజూసందర్శిస్తుంది. అదే విధంగా పరీక్షా కేంద్రాలను డీఐఈవో, డెక్ సభ్యులు, హై పవర్ కమిటీ సందర్శించి పరీక్షల నిర్వహణ పర్యవేక్షిస్తుంది.

కంట్రోల్ రూం ఏర్పాటు ...

ప్రాక్టికల్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. విద్యార్థుల వివిధ సమస్యల పరిష్కారానికి సూపరింటెండెంట్ శ్రీనివాస్ గౌడ్‌ను 9014448538 నంబరులో, జూనియర్ అసిస్టెంట్ జి. అబ్బసాయిలును 9490362648 నంబరులో సంప్రదించాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ నంబర్లు అందుబాటులో ఉంటాయి.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

డీఐఈవో బైరి శ్రీనివాస్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో బైరి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం డీఐఈవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాక్టికల్ పరీక్షలు సెలవు దినాల్లోనూ నిర్వహిస్తున్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యం విద్యార్థులను హాల్ టికెట్లు ఇచ్చేందుకు ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు.

పరీక్షలు సమర్థంగా నిర్వహించాలి

సీఎస్, డీవోల అవగాహన సమావేశంలో డీఐఈవో

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సమర్థంగా నిర్వహించాలని జనగామ డీఐఈవో బైరి శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎస్‌లు, డీవోలు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన పలు సూచనలు చేశారు. ప్రశ్నాపత్రాలను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని డెస్క్‌టాప్‌పై ఉంచుకోవాలన్నారు. ఓటీపీ రాగానే ఫోల్డర్లు ఓపెన్ చేసుకొని ప్రశ్నాపత్రం ప్రింట్ అవుట్ చేసుకోవాలన్నారు. గత నవంబరు, డిసెంబరులో జరిగిన ఓజేటీ మార్కులను అప్‌లోడ్ చేయాలన్నారు. మార్కులు అప్‌లోడ్ చేసే ముందు ఎగ్జామినర్ యొక్క బ్యాంకు అకౌంట్ నంబరును అప్‌లోడ్ చేయాలన్నారు.

వాల్యుయేషన్ చేసిన ఆన్సర్ బుక్‌లను గుడ్డలో ప్యాక్ చేసి హైదరాబాద్ లోని డిప్యూటీ సెక్రటరీ కార్యాలయానికి పోస్టాఫీసు ద్వారా పంపించాలన్నారు. సీఎస్‌లు, డీవోలు, ఎగ్జామినర్లు విధిగా ఐడీ కార్డులు ధరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌లు, డీవోలు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.